క్లుప్తంగా

వైఎస్సార్ చేయూతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న చేయూత లబ్ధిదారులు

మందస: మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. హన్నాళి పంచాయతీలో వైఎస్సార్ చేయూత లబ్ధిదారులతో అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. స్వయం ఉపాధితో ఆదాయం పెంపొందించుకోవాలని కోరారు. నాలుగో విడత చేయూత నిధులు త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీవోఏ చంద్రమ్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పరామర్శలో మున్సిపల్ చైర్మన్ గిరిబాబు తదితరులు

వజ్రపుకొత్తూరు రూరల్: గుళ్లలపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ దువ్వాడ శార్వాణి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకులు శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతిరాలి కుమారుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హేమబాబు చౌదరితో మాట్లాడి మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు వెంకటరమణ, ఎం.మన్మథరావు, సీహెచ్ గణపతి ఉన్నారు.

నేత్రపర్వంగా మృత్యుంజయేశ్వర ఆలయ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: ముత్యాలపేటలోని అమృత వర్షిణీ సమేత మృత్యుంజయేశ్వర ఆలయం, మోక్షసీతారామ స్వామి సహిత వివిధ ఆలయాల ప్రతిష్ట ఉత్సవాలు శనివారం నుంచి నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా విఘ్నేశ్వరపూజ, రక్షసూత్రధారణ, నిత్యార్చనలు, మహారుద్రాభిషేకం తదితర విశేష పూజా కార్యక్రమాలు వివిధ దేవతల మూల మంత్ర హోమాలను అర్చకులు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు నారాయణసేవ జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 20 వేల మంది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. రిటైర్డ్ డీఎస్పీ శమళ్ల ప్రసాదరావు, రిటైర్డ్ జిల్లా జడ్జి దూగాన చిరంజీవులు ప్రత్యేక పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ అఖండ నామసంకీర్తన నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

శతశాతం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని శతశాతం పూర్తిచేసి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహితో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షించారు.

'ఆమెకు విధులతో సంబంధం లేదు'

సంతబొమ్మాళి: గ్రామ, మండల సమైక్య సంఘాలు, వెలుగు సిబ్బంది విధులతో సీఎఫ్‌గా పని చేసి తొలగింపునకు గురైన పరపటి సుమలతకు ఎటువంటి సంబంధం లేదని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ శ్రీరాములు శనివారం స్పష్టం చేశారు. తొలగింపునకు గురైన విధుల్లోనే.. శీర్షికతో 'సాక్షి'లో శనివారం వచ్చిన కథనానికి వెలుగు అధికారులు స్పందించారు. రెండు లక్షల 40 వేల రూపాయలు అవినీతి చేసినట్లు రుజువు కావడంతో తీర్మానం చేసి గతంలోనే ఆమెను తొలగించామని పేర్కొన్నారు. నౌపడ స్టేట్‌బ్యాంక్ అధికారులకు ఈ విషయం స్వయంగా తెలియజేస్తామని, తదుపరి ఆదేశాలు వచ్చినంత వరకు ఎవరిని విధుల్లోకి తీసుకోవద్దని కోరమని అన్నారు. ఇన్‌చార్జిగా తార సుధారాణిని నియమించమన్నారు.

20 నుంచి పోలాకి జాతర

పోలాకి: ఈ నెల 20వ తేదీ నుంచి పోలాకి కనక దుర్గాభవాని అమ్మవారి 22వ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు టంకాల శ్రీరాములు, పల్లి రాజు తెలిపారు. ఐదురోజులపాటు నిర్వహించే జాతర కోసం ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. తొలిరోజు అమ్మవారి రథయాత్రతోపాటు ఐదురోజులపాటు హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్నదాత సేవలో 'ఆర్‌బీకే'లు!

- శరవేగంగా పక్కా భవనాల నిర్మాణం
- పలాస నియోజకవర్గంలో 71 కేంద్రాలకు రూ.15.48 కోట్లు మంజూరు
- ఆనందంలో రైతన్న



వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేటలోని రైతు భరోసా కేంద్రం



వజ్రపుకొత్తూరు: రైతు సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతకు ఎలాంటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకుంది. విత్తనాల నుంచి పంటల విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తున్న ఆర్‌బీకేల నిర్మాణాలు పలాస నియోజకవర్గంలో శరవేగంగా సాగుతున్నాయి. అలాగే సిబ్బందిని కూడా పూర్తిస్థాయిలో నియమించడంతో ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలు అందుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం

నియోజకవర్గంలో ఆర్బీకేల నిర్మాణం ఉద్యమంలా సాగుతోంది. రూ.15.48 కోట్లుతో 71 రైతు భరోసా కేంద్రాలను నిర్మిస్తున్నారు. వీటిలో వజ్రపుకొత్తూరు మండంలో 26, పలాసలో 16, మందసలో 29 కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 30 ఆర్‌బీకే భవనాలు ప్రారంభమవ్వగా.. మరో 28 ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే శ్లాబ్ లెవిల్‌లో ఐదు, బేస్‌మెంట్ లెవిల్‌లో పది ఉన్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ జి.రవిబాబు తెలిపారు.

రైతు వద్దకే ఎరువులు

ఆర్బీకేల ద్వారా రైతు వద్దకే ఎరువులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. పలాస వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఆర్బీకేల ద్వారా మెళియాపుట్టి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో యూరియా 2068 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1900, ఎంఓపీ 78, కాంప్లెక్స్ 77 మెట్రిక్ టన్నులను పంపిణీ చేశారు.



నిర్మాణం పూర్తి చేసుకున్న పలాస మండలం అల్లుకోల ఆర్‌బీకే..

కొబ్బరి తోటను సాగు చేసుకోగలిగాను



మా గ్రామంలో ఆర్‌బీకే ఉంది. తిత్లీ తుపాను తరువాత కొబ్బరి మొక్కలు ఇచ్చారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. వాటికి సస్యరక్షణలో భాగంగా ఆర్బీకే హార్టికల్చర్ అసిస్టెంట్ నుంచి పురుగు మందు, వేప నూనె, కాంప్లెక్స్ ఎరువుల, యూరియా, డీఏపీ సబ్సిడీ ధరలకే అందుకున్నాను. మా ఆర్బీకేలోనే సస్యరక్షణ చర్యలపై కియోస్కల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. కొబ్బరి మొక్కలు పెంచేందుకు దాదాపు రూ.40 వేలు వరకు ప్రభుత్వం నా ఖాతాలో జమ చేసింది. రైతు భరోసా అందింది. గత ప్రభుత్వంలో పైసా కూడా లబ్ధి పొందలేదు.

– దున్న ఢిల్లీరావు, రైతు, అమలపాడు

యుద్ధ ప్రాతిపదికన నిర్మించాం:



ఆర్‌బీకేలకు ప్రాధాన్యత ఇచ్చి భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నాం. ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేస్తోంది. 71 కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 56 కేంద్రాలు నిర్మాణం పూర్తి చేసుకుని బిల్లులు చెల్లించాం. మరో మరో 15 కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. 90 శాతం మేర ఆర్బీకేలు వ్యవసాయ శాఖకు అప్పగించాం.

– జి. రవిబాబు, డీఈఈ, పంచాయతీరాజ్, పలాస

ఎక్కడా ఇలాంటి వ్యవస్థ లేదు



దేశంలో ఎక్కడా ఆర్బీకేలు లాంటి వ్యవస్థ లేదు. వీటి ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నాం. నేరుగా రైతుకు ఎరువుల అందించాం. పంటలకు ఎరువుల వినియోగం, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.

–ఎల్.వి.మధు, ఏడీఏ, పలాస

పాఠశాల భవనాల పునః నిర్మాణానికి చర్యలు

మందస: పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 125 ఏళ్ల చరిత్ర ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించారు. అయితే రాజరికానికి గుర్తుగా విద్యాలయం ముందు భాగం చూపరులకు ఎంతో ఆకర్షిస్తుంటుంది. ఈ భవనాన్ని పునః నిర్మాణానికి మందస హైస్కూల్ ఓల్డ్ బిల్డింగ్ రెనోవేషన్ ఫోరం ఏర్పడింది. శిథిల భవనాన్ని బాగు చేయడానికి దాతలు ముందుకు వస్తున్నారు. కొన్ని భవనాలను యథావిధిగా నిర్మించడానికి నూజివీడు నుంచి నిపుణుడైన ఆర్కిటెక్ట్‌తో పాటు ఆయన టీంను శనివారం పాఠశాలకు తీసుకువచ్చారు. భవనాలను పరిశీలించిన ఆయన భవనాలు పటిష్టంగా ఉన్నాయని, మరో 50 ఏళ్ల వరకు ఎటువంటి సమస్య ఉండదని చెప్పినట్టు కమిటీ ప్రతినిధులు చెప్పారు. పునఃనిర్మాణం యథా ప్రకారం చేయగలమని చెప్పడంతో అంచనాలు వేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పరిశీలలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, శిస్టు సోమనాథ్, శానాపతి కిశోర్‌కుమార్, కె.హేమంత్, ఇప్పిలి కేశవరావు ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

- టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి



గ్రామపెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలచంద్రా రెడ్డి

జలుమూరు: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు తిలారు జంక్షన్‌లో జరగనున్న లక్ష్మీనరసింహస్వామి 26వ వార్షికోత్సవాల జరనున్నాయి. జలుమూరు పోలీస్ స్టేషన్‌లో చిన్నదూగాం గ్రామ పెద్దలతో టెక్కలి డీఎస్పీ కె.బాలచంద్రారెడ్డి శనివారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. స్వామివారి ఉత్సవాల నిర్వహణకు గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణం, దర్శనాలు తదితర కార్యక్రమాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖతో కలిసి సజావుగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సమ్మతించారు. నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు, ఎస్ఐ మధుసూదనరావు పాల్గొన్నారు.

పీఎం సౌర గృహ పథకంపై అవగాహన



విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఈ రవికుమార్

ఆమదాలవలస రూరల్: సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని రూరల్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి ప్రధానమంత్రి సౌర గృహ పథకంపై శనివారం అవగాహన కల్పించారు. సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ పొందడానికి సచివాలయంలో గృహ వినియోగదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖ సిబ్బందిపై ఉందన్నారు. విద్యుత్ వినియోగంలో ఆదాతోపాటు తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను సోలార్ ద్వారా పొందవచ్చన్నారు. ఈ పథకం పొందే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.60 వేల సబ్సిడీ అందించడంతోపాటు మిగిలిన ఖర్చుకు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం కోసం విద్యుత్ సిబ్బందికి ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్ తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మన్‌లు ఈ పథకం గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. తక్కువ ఖర్చుతో విద్యుత్ పొందే మార్గాలను ప్రభుత్వం ప్రజలకు అందజేస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా రామమందిర ప్రతిష్టా మహోత్సవం



పూజల్లో పాల్గొన్న దంపతులు



ప్రతిష్టా విగ్రహాలకు జలాధివాసం జరుగుతున్న దృశ్యం

గార: జొన్నలపాడు కాలనీలోని రామమందిర ప్రతిష్టా మహోత్సవాలు శనివారం ఉదయం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ దార్లపూడి కామేశ్వర శర్మ, ఆరవెల్లి బాలభాస్కరశర్మల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజతో మహోత్సవాన్ని అర్చకులు ఆరంభించారు. ఈ సందర్భంగా మండప ఆరాధనలు, నీరాజన మంటపాలు జరిగాయి. అధిక సంఖ్యలో దంపతులచే దీక్షాధారణ, కంకణధారణ నిర్వహించారు. ప్రతిష్టా విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేంద్ర మృతి



సంతబొమ్మాళి: టెక్కలి ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ప్రధాన రాజేంద్ర (47) అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఈయన 2006 నుంచి 2008 సంవత్సరం వరకు టెక్కలి ఏఎంసీ చైర్మన్‌గా, అలాగే 2017–19 మధ్య వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడుగా పనిచేశారు. ఈయన స్వగ్రామం మండలంలోని వడ్డితాండ్ర పంచాయతీ కె.కొత్తూరు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేంద్ర మృతిపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కాలువలను మెరుగుపరచాలి



కాలువను పరిశీలిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి కోరారు.శ కాశీబుగ్గ, పలాస పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించి డ్రైనేజీలను పరిశీలించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: విద్యాహక్కు చట్టంలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ఏంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీవర్గాల పిల్లలకు ఇది వర్తిస్తోందన్నారు. ప్రైవేటు, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు అర్హత గల విద్యార్థుల ఆధార్ వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 18004 258599 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అవినాష్ కేస్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

టెక్కలి: అధ్యాపకుల కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నాగ్‌పూర్ వీఎస్ఐటీ ప్రొఫెసర్ అవినాష్ కేస్కర్ సూచించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం, ఏఐసీటీఈ, ఎటీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి అధ్యాపకుల కోసం నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అవినాష్ కేస్కర్ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమ బోధన అందజేయడానికి నిర్వహిస్తున్న అధ్యాపకుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అవినాష్ కేస్కర్‌ను యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆజాద్, ఎం.జయమన్మథరావు, బి.రామారావు, ఎ.జయలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



అభినందనలు అందుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంతబొమ్మాళి: జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో కబడ్డీ సీనియర్స్ బాలుర విభాగంలో బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. దీంతో శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ, సిబ్బంది క్రీడాకారులను అభినందించారు. విద్యార్థులు విజేతలుగా నిలిచేందుకు విశేషకృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.తిరుపతిరావు, సాయి శివానీలను సత్కరించారు. ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, ఉమాదేవి, రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి, రజని, శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, శంకరరావు, సాయిశివాని, త్రివేణి పాల్గొన్నారు.

యూజీపురం-మెళియాపుట్టి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ఉద్దానం గోపీనాథపురం–మెళియాపుట్టి జంట గ్రామాల ప్రజల కల ఎట్టికేలకు నెరవేరింది. ఏఐబీ నిధులు రూ.1.50 కోట్లతో చేపట్టనున్న 2.4 కిలోమీటర్ల బీటీ రహదారి పనులను సర్పంచ్ కర్ని శ్రీను ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శిలాఫలకం వేసి వదిలేశారు. ఆ తరువాత దీని గురించి పట్టించుకోలేదు. రహదారి ప్రాధాన్యతను గమనించిన మంత్రి సీదిరి అప్పలరాజు ప్రత్యేక దృష్టిసారించి నిధులు మంజూరయ్యేలా చేశారు. పనులు ప్రారంభం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటినుంచి జయమ్మ స్మారక దినాలు



జయమ్మ స్మారక దినోత్సవ కరపత్రాలను అవిష్కరిస్తున్న నాయకులు

రణస్థలం: విప్లవ ధీర వనిత జయమ్మకు నివాళిగా ఈ నెల 18 నుంచి వారం రోజులపాటు స్మారక దినాలను పాటించాలని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని పైడిభీమవరంలో జయమ్మ స్మారక దినోత్సవ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవ స్ఫూర్తితో భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజా స్వామిక విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోతామన్నారు. ఈ నెల 22న శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న కామ్రేడ్ జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. 2020 ఫిబ్రవరి 24న ఆమె మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. కరపత్రాల ఆవిష్కరణలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

- మున్సిపల్ కమిషనర్ తమీమ్ అన్సారియా



నిర్మాణాలపై కొలతలు వేయిస్తున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తామని శ్రీకాకుళం నగర పాలకసంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. శాంతినగర్ కాలనీలోని నాగావళి రివర్‌వ్యూ పార్కు, కృష్ణా పార్కులను శనివారం సందర్శించారు. అలాగే పలు నిర్మాణాలు, స్ట్రీట్‌ఫుడ్ ప్రాంతాలను పరిశీలించారు. అనుమానం ఉన్న నిర్మాణాలపై కొలతలు వేయించారు. అయితే ఎటువంటి లోపాలు లేకపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించి నగర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరు ప్లాన్‌లు తీసుకుని ధైర్యంగా నిర్మాణాలు చేసుకోవచ్చాన్నారు. కమిషనర్ వెంట టీపీఎస్ ఉమామహేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన ఎడ్లపల్లి జగన్నాథ్ పూరి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ విభాగంలో స్టాటికల్ ఇన్వెస్టిగేటర్‌గా పనిచేస్తున్నారు. ఎనలైటనింగ్ ఆన్ రిలయబుల్ ఎస్టిమేట్, సస్టైనబుల్ గ్రోత్ ఆఫ్ వైటల్ స్టాటిస్టిక్స్ సిస్టం ఇన్ ఇండియా (ముఖ్యమైన అంచనాలు, గణాంకాల వ్యవస్థ యొక్క స్థిరమైన వృద్ధిపై అవగాహన కల్పించడం) అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు జగన్నాథ్ పూరి శనివారం తెలిపారు. జగన్నాథ్ పూరికి తల్లిదండ్రులు కృష్ణారావు, దమయంతి, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బూత్ స్థాయి ఆఫీసర్లు(బీఎల్‌ఓ) పాత్ర చాలా కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని నరసన్నపేట ఈఆర్‌ఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నాలుగు మండలాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల్లో సిద్ధం చేశామని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఓటు నమోదు కోసం, పేరు మార్పు, పోలింగ్ కేంద్రం మార్పు వంటి దరఖాస్తులు వస్తే వెంటనే పరిశీలించి, మీ లాగిన్ నుంచి తహసీల్దార్‌కు పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పరిశీలించి, ఏమాత్రం అనుమానం ఉన్నా తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు, ర్యాంప్ కచ్చితంగా ఉండాలన్నారు. తహసీల్దార్ కనకారావు, డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

మండల కూర్మారావు, S/o పండయ్య అనే నేను బహాదపల్లి గ్రామంలో నా టీడీ పరిశ్రమ నుండి లింబుగాం గ్రామానికి తే 25.11.2023 దిన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా 623/2010 & 1024/2010 నెంబరు గల అస్తి పత్రాలు మార్గమధ్యంలో చేజారిపోయినవి. పత్రాలు పోగొట్టుకున్న విషయం తే 25.11.2023 దిన మందస పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగినది. ఎవరికైననూ దొరికిన యెడల నాకు అప్పగించగలరు.
మండల కూర్మారావు
లింబుగాం పంచాయితీ, లింబుగాం గ్రామం, మందస మండలం. సెల్: 6302765982

డాక్యుమెంట్ పోయినది

మండల కూర్మారావు, S/o పండయ్య అనే నేను బహాదపల్లి గ్రామంలో నా టీడీ పరిశ్రమ నుండి లింబుగాం గ్రామానికి తే 05.01.2024 దిన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా 554/2012 నెంబరు గల అస్తి పత్రాలు మార్గమధ్యంలో చేజారిపోయినవి. పత్రాలు పోగొట్టుకున్న విషయం తే 06.01.2024 దిన మందస పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగినది. ఎవరికైననూ దొరికిన యెడల నాకు అప్పగించగలరు.
మండల కూర్మారావు
లింబుగాం పంచాయితీ, లింబుగాం గ్రామం, మందస మండలం. సెల్: 6302765982

19న హర్షవల్లి-చరిత్ర సంస్కృతి పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు రచించిన 'హర్షవల్లి–చరిత్ర, సంస్కృతి పుస్తకాన్ని ఈనెల 19న మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరిస్తారని అరసవల్లి ధర్మకర్తల మండలి సభ్యుడు మండవిల్లి రవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో పలువురు రచయితలు పాల్గొంటారన్నారు.